# 43. ప్రయివేట్ లెటర్

**కొన్నేళ్ళ** కిందట నేనొక ప్రభుత్వ సంస్థలో చిన్న ఉద్యోగంలోకి డెప్యుటేషను పద్ధతిలో వెళ్లినపుడు అక్కడ మేనేజింగు డైరక్టర్‌గా సహదేవరావు ఉన్నారు. పెద్ద కంపెనీ ఎం.డి. కదా; ఈయనతో మంచిగా ఉండడం మంచిదని కొందరు; ఈయన్ని ఏదైనా కార్యక్రమంలో ఇన్‌వాల్వ్ చేస్తే లాభసాటి అని కొందరు భావించే సంప్రదాయం ప్రపంచ వ్యాప్తంగా ఉంది కనక అనుకుంటాను; రోటరీ క్లబ్బు వారు నీళ్లను గురించి సెమినారు పెట్టినా, పురందర సంగీత అకాడమీ వారు మ్యూజిక్ ఫెస్టివల్ పెట్టినా ఈయన్ని 'ముఖ్య అతిథి' గా పిల్చుకెళ్లేవారు.

ఒకసారి చలన చిత్ర దర్శకుడు బి.ఎన్.రెడ్డి గారు ఊళ్లో కొస్తేనూ, స్థానిక ఫిలిమ్ సొసైటీ వారు ఆయనకి సన్మానం, ప్లస్ ఆయన దర్శకత్వంలో ఒచ్చిన 'బంగారు పాప' చిత్రం ప్రదర్శనా తలపెట్టేరు. ఆ సంఘటనకి ముఖ్య అతిథి బి.ఎన్. రెడ్డి గారే అయినా ఆకార్యక్రమం మన సహదేవరావు గారి అధ్యక్షతలో జరగాలని ఫిలిమ్ సొసైటీ వారు ఆకాంక్షించేరు. అటువంటప్పుడు తిన్నగా ఆయన దగ్గిరికెళ్లి "అయ్యా, ఈ కార్యక్రమానికి మీరు అధ్యక్షుడుగా రావాలి సుమండీ!" అని ప్రార్థించొచ్చు కదా! అలా చెయ్యకుండా ఆ ఫిలిం సొసైటీ వారు నా దగ్గరికొచ్చి "మీ ఎం.డి.గార్ని ఛీఫ్ గెస్టుగా పిలవాలను కుంటున్నాం; మీ సహాయం కావాలి." అన్నారు. 'నేనేం మిమ్మల్ని చెయ్యి పట్టుకుని ఆయన దగ్గిరికి తీసికెళ్లక్కర్లేదు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆయనకి ఇష్టమే.' అని చెప్పేను.

అప్పుడు వాళ్లు ఆయన దగ్గిరికి వెళ్లి అడిగేరు. ఆయన ఒప్పుకున్నారు. "ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించడానికి ఆయన్నే పిలవాలని మీరు పట్టు పట్టేరని చెప్పేకనే ఆయన ఒప్పుకున్నారు సుమండీ! ఈ చిన్న అబద్ధం ఆడినందుకు కోప్పడక ఈ సంగతి గుర్తు పెట్టుకోండి." అని ఆ సొసైటీ కార్యదర్శి నాతో అన్నారు. నేను నిర్ఘాంతపోయాను.

ఆ కార్యక్రమంలో తాను మాట్లాడ వలసినదంతా కాకపోయినా కొన్ని పాయింట్లు తనకి "ఫీడ్" చెయ్యమని సహదేవరావు నాకు మా సూపరింటెండింగ్ ఇంజినీర్ ద్వారా కబురు పెట్టేరు. వాహినీ ప్రొడక్షన్సు స్థాపన, వారి చిత్రాలు, వాట్లో సంగీత సాహిత్యాది వస్తువుల ఉత్కృష్టత, మూలా నారాయణస్వామి, రాంనాథ్, శేఖర్, నాగయ్య మొదలైన వారి ఉత్తమ అభిరుచులు, బి.ఎన్-కె.వి. రెడ్డి గార్ల మధ్య సయోధ్యతో కూడిన సబ్జక్టు పంపకాలు, సముద్రాల రాఘవాచార్యులు గారి నుండి పింగళి నాగేంద్రరావు గారి వరకూ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి వరకూ రచయితలనీ, కవులనీ వారు ఆదరించిన విధానం; పాలగుమ్మి పద్మరాజు గార్ని భీమవరం నుంచి తీసుకు రావడం; ఇవన్నీ పాయింట్లు పాయింట్లుగా నోట్ తయారుచేసేను. "అన్నీ ఒక ఎత్తూ, సైలాస్ మార్నర్ అనే (జార్జి ఇలియట్) నవలని బంగారం లాంటి చిత్రంగా "బంగారు పాప"గా మలచిన పద్మరాజు, నరసరాజుగార్ల ప్రతిభ ఒక ఎత్తూ" అని సహదేవరావు ఆ రోజున చాలా చక్కగా మాట్లాడేరు. అదంతా విని బి.ఎన్.రెడ్డి గారు కళ్లనీళ్లు పెట్టుకున్నారు కూడాను.

ఆ ప్రోగ్రాంకి ఫిలిం సొసైటీ సభ్యులతో బాటు ఆహ్వానాలందిన వారిలో మా సంస్థ అధికారులు కొందరు కూడా ఉన్నారు. మా ఎం.డి. గారి పి.ఏ. సాంబశివరావు గారు; మా సూపరింటెండింగ్

ఇంజినీర్ శేషగిరిరావు గారూ ఇలాగ. మీటింగూ, సినిమా ప్రదర్శన అయిపోయాక మా ఎం.డి.గారి పి.ఏ. గారు నన్ను ప్రత్యేకంగా కలుసుకొని "ఎం.డి.గారు చాలా బాగా మాట్లాడేరు కదూ!" అని నన్ను పలకరించేరు.

"ఆయన కాకపోతే మీరూ నేనూ అలా మాట్లాడగలమా ఏమిటి!" అని నా పద్ధతిలో నేను ప్రశంసించాను.

"ఎలాగయినా ఆ స్పీచ్‌కి జీవం పోసింది మీరిచ్చిన సమాచారమే కనక ఆ గొప్పతనంలో సగం మీకు కూడా చెందుతుంది." అన్నారు సాంబశివరావు. నేను ఔనన్నా కాదన్నా కూడా ఏదో కాంప్లికేషను రావడం ఖాయం అని తలచి నేనేమీ మాట్లాడలేదు. "మన సంస్థలో సుమారు 1980 మంది పనిచేస్తున్నారు. ఇంతమందిలో ఆ స్పీచి కోసం డేటా ఇమ్మని అడగడానికి వారు మిమ్మల్నే ఎంచుకున్నారంటే వారికి మీపై ఉన్న గురి ఎంతయిందీ అర్థమైపోతూనే ఉంది. మీ కెపాసిటీకి తగిన అవకాశం మీకు దొరికినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను." అని సాంబశివరావు ఇంకో అడుగు ముందుకి వేసేరు. దానిక్కూడా నేనేమీ అనకపోతే ఇంకా రెచ్చిపోతాడని ఆలోచించి; "ఇందులో నాదేముంది? మన పబ్లిక్ రిలేషన్స్ మేనేజరు రంగారావు గారు సమయానికి ఊళ్లో లేరు గాని లేకపోతే ఇదంతా ఆయన డ్యూటీ కదా." అన్నాను.

"మీదంతా మితిమీరిన మాడెస్టీ సార్. అసలే మీరూ సహదేవరావు గారూ యూనివర్శిటీలో కొలీగ్స్. ఆపైన ఒకే కులం వారు. మీపైన సహదేవరావు గారికి ఉన్న నమ్మకం ఎంతటిదో తెలుస్తూనే ఉంది. ఎప్పుడయినా ఎవరికైనా వారివల్ల ఏదైనా ఉపకారం జరగాలంటే సరైన ఆధారం మీరే అని ఇప్పుడు తెలిసిపోయింది. దయ ఉంచండి సార్" అని, సమాధానం చెప్పే అవకాశం కూడా నాకివ్వకుండా స్కూటర్ కిర్రుమనిపించి వెళ్ళిపోయారు సాంబశివరావు.

నాకు గుండె కలుక్కుమంది. నాకు ఆ సంస్థతో పెద్ద అటాచ్‌మెంటు లేదు. సహదేవరావు కూడా ఆ సంస్థలో శాశ్వతంగా ఉండిపోడానికి రాలేదు. అయితే పర్మనెంటుగా ఉండిపోయే ఇటువంటివాళ్లు ఏదైనా మంచి జరిగినా చెడు జరిగినా కూడా ఇలాగ మా ఇద్దరికీ లింకు పెట్టేసి ప్రచారమో కౌంటర్ ప్రచారమో సాగించగలరని స్ఫురించి విసుగులాంటిది కలిగింది.

ఆ తరవాత కొన్నాళ్లకి సహదేవరావు ఆస్ట్రేలియాకి (టూర్) వెళ్ళి పదిహేను రోజుల దాకా రాలేదు. ఆ పదిహేను రోజుల్లో సాంబశివరావు గారు నాకు ఐదారుసార్లు కారిడార్స్‌లోనూ కార్ పార్కింగ్ దగ్గిరానూ తగిలేరు. రావు గారికీ నాకు "ఉన్న" పరిచయాన్నీ పరస్పరాపేక్షనీ అంతబాగా అపార్థం చేసుకున్న వారు మరొకరు లేరని చెప్పడానికి వీలుగా; మొదటిసారి తగిలినప్పుడు నేను కాజువల్‌గా "ఎం.డి గారెప్పుడొస్తారు?" అని అడిగినప్పుడు ఆయనిచ్చిన సమాధానం వచ్చింది: "పేరుకు నేను పి.ఏ.నే గాని ఆయన మూవ్‌మెంట్స్ గురించి మాకన్నా మీకే బాగా తెలుస్తుంది!"

ఆ తరువాతంతా ఆయనే, నేనేమీ అడక్కుండానే; ఎం.డి.గారి. కేంప్ గురించీ, ఆయన ఆ కాంప్‌లో అనవసరంగా ఎక్కువ రోజులుండి పోవడం గురించీ అందు మూలాన్నించి పేరుకుపోయే వర్క్ గురించీ దానివల్ల తను పడబోయే శ్రమ గురించీ-

సహదేవరావు తిరిగొచ్చిన రోజునే; మరీ ఆయన ఆఫీసుకు చేరిన మొదటి పది నిమిషాల్లోనే నాకు కబురొచ్చింది.

ఆ సంస్థలో నేనెంత చిన్న ఉద్యోగినంటేనూ, ఆయనకీ నాకూ మధ్య కనీసం ఏడు రాంకుల

అధికారులున్నారు. ఏదైనా సాహిత్య చర్చ, నోస్టాల్జియా అవసరం వస్తే బంగళాకి రమ్మని చెప్పడమే తప్ప ఛేంబర్సులోకి నాకు ప్రవేశార్హత లేనే లేదు.

ఐనా వెళ్లాలి కదా. ఆ సంస్థలో పనిచేసే రెండు వేల మందిలో ఎవర్నయి నా ఆయన పిలిపించగలరు.

నేను వెళ్లేక ఆయన నన్ను కూర్చోమనలేదు. ఒక కవరు నా ముందుకి తోసి "ఇది మీకేనా? చూడండి." అన్నారు.

కవరు మీద ఎడ్రసు ఇలా వుంది: నా పేరు; కేరాఫ్ కె.ఎస్.రావు; ఎం.డి; ఫలానా సంస్థ- ఇత్యాది.

"నాదే, సార్" అని కవరు తీసి జేబులో పెట్టుకోబోయాను.

"ఎవరు రాశారు?" కరుకుగా అడిగారాయన.

"ఫ్రం ఎడ్రస్ లేదు, ఈ దస్తూరి నాకు పరిచయం లేదు. అంచేత ఎవర్రాసేరో తెలీదు." అన్నాను.

"విప్పి చూడండి" అని, లెటర్ ఓపెనర్ నాముందుకి తోసేరు.

విప్పాను. అందులో ఉన్న కాగితం నేను బైటికి లాగక ముందే; "గివిట్టుమి!" అన్నారు సహదేవరావు.

లోపల ఒకే ఒక కాగితం. అది ఒక న్యూస్ పేపరు కటింగు. దాన్ని వెలపలా దాపలా చూసేసి నాకు ఇచ్చేసారు సహదేవరావు. "ఎవరు పంపేరు?" గద్దించి అడిగారు.

నేను ఆ కటింగు చూసిన కొన్ని సెకండ్లకి నాకు తెలిసింది అది ఎవరు పంపేరో.

"స్పీకప్!"

"ఇది గుంటూరు శేషేంద్ర శర్మగారు పంపేరండీ. కొన్నాళ్ల కిందట ఆయన నాకు బందరులో తగిలినప్పుడు అయ్యా; వయొలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు గారు చనిపోయినప్పుడు మీరు ఒక మంచి "ఎలిజీ" రాసేరట; దాని కాపీ ఒకటి నాకు పంపితే నేను ఆ మహనీయుడిని గురించి రాయదల్చుకున్న వ్యాసంలో కోట్ చేసుకుంటాను- అని అడిగాను. అందుకని పంపివుంటారు."

"నా కేరాఫ్ ఎడ్రస్‌కి ఎందుకు పంపేరో?"

"ఆయనకి నా అడ్రస్ వివరంగానే ఇచ్చేనండి. అయితే ఆ చీటీ ఎక్కడో పడిపోయుంటుంది. ఐతే అందులో కె.ఎస్.రావు అనే పేరొక్కటీ ఆయనకి గుర్తుండిపోయుంటుంది. మిమ్మల్ని కూడా ఆయనకి బాగా తెలుసు గనక నేను ఆ చీటీలో రాసిన కె.ఎస్.రావు మీరే అనుకుని ఈ కవరు మీద మీ అడ్రస్ రాశుంటారు."

"కాని, మీరు కేరాఫ్ కె.ఎస్.రావు అని అతనికెందుకు చెప్పేరు?"

"మా ఇంటి ఓనర్ పేరూ కె.ఎస్. రావేనండి. ఈ విషయం మీకు లోగడే తెలుసు. అతను ఈ వూళ్లో ప్రఖ్యాతులైన కె.ఎస్.రావుల్లో మొదటివాడు. రెండో వారు మీరు. మూడో వారు నేవీలో డిప్యూటీ ఆర్మమెంట్స్ సప్లయి ఆఫీసరుగా ఉన్నారు; ఆయన్నీ మీకు తెలుసు."

సహదేవరావు నవ్వేసి "యు కెన్ గో." అన్నారు.

✤ ✤ ✤

"మీ యూనివర్సిటీ కొలీగ్‌ననీ, మీ కులం వాడినే ననీ, తన రచనలంటే మీకు చాలా ఇష్టమనీ, మీతో తనకు గొప్ప చనువు ఉందనీ, తను తల్చుకుంటే మీచేత ఏ ఉపకారమైనా చేయించగలడనీ చెప్పుకుంటూ తిరుగుతున్నాడు." అని నా గురించి సాంబశివరావు సహదేవరావుకి ఒకటికి రెండుసార్లు సూచనగా చెప్పడం వల్లనే సహదేవరావు ఆ రోజున ఆవిధంగా ప్రవర్తించారని నాకు క్రమంగా తెలిసింది.

☼

*( " ఆంధ్రభూమి " డెయిలీ : 26-2-92 )*